# అది మాత్రం అడక్కు

- రచన : శంకరమంచి పార్థసారథి

## ఇందులో పాత్రలు

కృష్ణమూర్తి

సూరిబాబు

అప్పలనర్సింహం

సుబ్బలక్ష్మి

# అది మాత్రం అడక్కు

( తెల తొలగేసరికి, కృష్ణమూర్తి ఆఫీస్‌కు వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు. గదిలో అటూ ఇటూ తిరిగి పెన్ను కనిపించక వెతుక్కుంటూ .... సుబ్బులూ పిలిచాడు. జేబులో వెదుక్కుని సుబ్బలక్ష్మీ అంటూ పిలిచాడు. మళ్ళీ డ్రాయరు సొరుగు వెదికి ( పెద్దగా ) వెంకట లక్షీ అంటూ అరిచాడు, సుబ్బలక్ష్మి వచ్చింది )

సుబ్బ : ఏవండీ పిలిచారా ?

కృష్ణ : పిలవలేదు. గొంతు పగిలేట్లు అరిచాను.

సుబ్బ : ( చెవులు మూసుకుని ) నాకు చెవుడేం లేదు. ఎందుకో చెప్పండి.

కృష్ణ : ఈ టేబిల్ మీద నా పెన్ను కనబడటం లేదు. పెట్టిన వస్తువులు పెట్టిన చోట పెట్టినట్లుండదు గదా !

సుబ్బ : నిన్న మీరు ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు తీసుకొచ్చారాని.

కృష్ణ : అంటే పెన్ను తీసుకురాకుండనే ఇల్లంతా వెదుకుతున్నాననుకున్నావా ?

సుబ్బ : ఉయ్యాల్లో పిల్లాడ్ని పెట్టుకుని వూరంతా వెదికినట్లూ అప్పుడప్పుడు అలా కూడా వెదుకుతుంటారు గదా !

కృష్ణ : అలాంటి సమాధానాలే నాకు ఒళ్ళుమంట.

సుబ్బ : పోనీ టేబిల్‌మీద పెట్టిన ఫైలైనా ఉందా ! అదీ మాయమైందా ?

కృష్ణ : పెన్ను గురించి నే వెదుకుతుంటే ఫైల్ గురించి మాట్లాడతావేమిటి ! అది టేబుల్ మీదే ఉంది.

సుబ్బ : రక్షించారు ఉంది గదా !

కృష్ణ : మెనీ మెనీ థాంక్స్ – వస్తా ....

( అంటూ ఫైలు తీసుకుని చెప్పులు తొడగబోతుండగా )

సుబ్బ : ఆఫీసుకేనా ?

( ఆ మాటవిన్న కృష్ణమూర్తి కోపంగా భార్యవైపు చూసి )

కృష్ణ : అబ్బేకాదు నూన్‌షోకి. ఆఫీసుకుకి బయల్దేరిన వాడినాపి ఆఫీసుకేనా అనడగటంలో నీ వుద్దేశ్యం ?

సుబ్బు :  సర్లేండి ఇపుడు  నేనేం అన్నానని అంత కోపం.

కృష్ణ :  బయటికెళ్తున్న  శాల్తీని  బ్రేకునొక్కి ఆపావంటే ఏదో విషయం ఉండే ఉంటుంది త్వరగా చెప్పు....

సుబ్బు : సాయంత్రం  త్వరగా వస్తారేమోనని...

కృష్ణ :  అంటే త్వరగా రమ్మనా ? వద్దనా ?

సుబ్బు : త్వరగా రమ్మనమనే.

కృష్ణ : ఏమిటి పని, మసి గిన్నెలు తోమాలా మల్లెపూలు కట్టాలా...

సుబ్బు : ఛ...ఛ..అలాంటి పనులు మీచేత చేయిస్తానా – అవేం కాదు కొత్త సినిమా వచ్చిందిగా, సరదాగా ఫస్టు షోకి.....

కృష్ణ :  ( మొహంలో రంగులు మారాయి  – చేతిలో వున్న ఫైలుని  బల్లపైకి బలంగా విసిరేసి ) సినిమా  – సినిమా – సినిమా – నీకీ పిచ్చి బాగా పట్టేసింది.  నాకొచ్చే జీతం రాళ్ళలో సగం  ఇంటివాడు, మిగిలినవి ఆ హాలు వాడు పుచ్చేసుకుంటున్నారు నేనేమో  నిన్ను మేపటానికి  అడ్డమైన ప్రతి అడ్డగాడిద కాళ్ళు పుచ్చుకుని అప్పుల్జేస్తున్నా.

సుబ్బు : ఎందుకలా అరుస్తారు, పద్నాలుగో రీల్లో హీరోలాగా.

కృష్ణ : నే హీరోని కాను కానీ, నువ్వు మాత్రం నాకు విలన్‌వి. అసలు ఇవ్వాల్టి తారీకెంత.

కృష్ణ : జోకులెయ్యకు కాకమీదున్నా !

సుబ్బు :  మొగుడూ  పెళ్ళాలూ – ఆలుగమగలు అంటే తూర్పు పడమరకాదు, ఇద్దరు మిత్రుల్లా, తోడుదొంగల్లా, నిండు దంపతుల్లా చిలకాగోరింకల్లా, పచ్చని కాపురం సాగిస్తూ, మధుర స్వప్నంలాంటి  బంగారు  కలలు కంటూ జన్మ జన్మల బంధంలా ఉండాలేగానీ పదే పదే అప్పు చేసి  పప్పుకూడు అంటూ వింత ఇల్లు సంతగోలలాగ కొంటె కాపురం చెయ్యకూడదండీ !

ఎప్పుడైనా  మీరు నన్ను దేవత, ఇల్లాలు, మా ఇంటి మహాలక్ష్మి అన్నారా ! లేదు. కాలం మారింది. కాలంతోపాటు  మనుషులు మారాలి. మంచిమనుషులు కావాలి. అప్పుడే ప్రేమమూర్తులుగా పండంటి జీవితం ప్రతిధ్వనిస్తుంది. రోజు రోజుకీ మీరు చిలిపి మొగుడిలా  తయారవుతున్నారే గాని చిలిపి కృష్ణుడు కాలేకపోతున్నారు.

కృష్ణ : అసలు, అసలు నీకా బూతు సినిమాలు చూసి చూసి బుర్ర అడ్డం తిరిగింది.

సుబ్బ : పదిహేను.

కృష్ణ : ఈ నెల్లో ఇప్పటికెన్ని సినిమాలు చూసావో లెక్కగట్టేవా ?

సుబ్బ : ఎన్నేమిటి పదకొండేగా ?

కృష్ణ : పదకొండేగా ! సుబ్బలక్ష్మీ నీ సహనానికి నా జోహార్లు. ( చేతులు జోడించాడు ) అసలు మీ నాన్న నిన్ను ఏ సినిమాపక్షికో, హాల్లో చీట్లు చింపేవాడికో ఇచ్చి కడితే ఏ గొడవాలేకుండాపోను.

సుబ్బ : పోన్లెండి – మీరైనా హాల్లో ఆ ఉద్యోగం చూసుకుంటే సరిపోను.

కృష్ణ : ఆహా... ఏమి బుర్రే ! బ్రిటీష్ మ్యూజియంలో పెట్టించాలి. గొప్ప మేధస్సు. అమోఘమైన ఆలోచనలు.

సుబ్బ : అదేదో సినిమాహాల్లోనే పెట్టించండి – తెలుస్తుంది.

కృష్ణ : సినిమాహాల్లో పెట్టించాల్సింది నీ ఫోటో – ప్రతి హాలు గుమ్మానికి వ్రేలాడ తీయించాలి.

సుబ్బ : మన పెళ్ళి ఫోటో పెట్టిస్తే ఎలా ఉంటుందీ ?

కృష్ణ : జోకులెయ్యకు – కాక మీదున్నా. అసలు నీకు బూతు సినిమాలు చూసి చూసి బుర్ర అడ్డం తిరిగింది.

సుబ్బ : అలా అరవకండి – ఎవరన్నా వింటే నిజమనుకోగరు. నే చూసేవి బూతు సినిమాలేం కాదు తెలుగు సినిమాలు.

కృష్ణ : నే చెప్పేది వాటి గురించే – అదే నా భాయం. నువ్వేమైపోతానోనని (అనునయంగా ) సుబ్బలక్ష్మి కడుపుకి తిను, కాదన్ను, చీరె, సారె కొనుక్కో కాదన్ను నగానట్రా చేయించుకో అసలు కాదన్ను, కాని ఎందుకొచ్చిన సినిమాలే.

సుబ్బ : సినిమాలు చూస్తే బుద్ధి వికసిస్తుందని మొన్న హోం మంత్రిగారు కూడా చెప్పారు.

కృష్ణ : ఆయన చెప్పింది తెలుగు సినిమాల గురించి కాదు. ఇవి చూస్తే ఉన్నది కాస్తా వూడ్చిపెట్టుకుపోతుంది. ఇకనుంచి సినిమా వూసెత్తేవో బడితెపూజ ఖాయం. తర్వాత నీ ఇష్టం.

సుబ్బ : అంటే అస్సలు కూడదా ?

కృష్ణ : కూడదాకాదు – అసలా మాటే వినిపించకూడదు వినిపించిందా, మీ నాన్నకి ఉత్తరం రాసి పిలిపించి కూతుర్ని కాపురం చేసుకోమంటాడో లేక వచ్చిన అడ్డమయిన ప్రతి సినిమా చూడమంటాడో తేల్చి చెప్పమంటా.

సుబ్బ : మీకేం మీరు అలానే అంటారు. మీరేమో ఆఫీసుకెళ్ళిపోతారు. నే వొక్కదాన్ని తోచక మార్నింగ్‌షోకెడితే తప్పా ?

కృష్ణ : అంటే రూటు మార్చి, అట్నుంచి నరుక్కొస్తున్నావన్న మాట. ఇదుగోచూడు , నీది సినిమా బుర్రయితే , నాది సెన్సార్ బుర్ర , కత్తిరించి పారేస్తా జాగ్రత్త.

సుబ్బ : అందరాడవాళ్ళలాగే నాక్కూడా ఓ బాబో, పాపో పుట్టుంటే మీరెళ్ళమన్నా సినిమాలకెళ్ళేదాన్ని కాను, పెళ్ళయి అయిదేళ్ళయింది. చుట్టు ప్రక్కల అంతా అడగటమే ఏమన్నా విశేషముందా అని.

కృష్ణ : అంటే నీకు కడుపొచ్చేదాకా నన్నిట్టా కాల్చుకుతింటావన్న మాట, ఇదిగో చూడు, ఇకనుంచి నెలకి ఒక్క సినిమా అది ఫస్టుషోకి తెల్సిందా ? నాకు తెలీకుండా మార్నింగ్‌షోలకి వెళ్ళావో మక్కెలు యిరిగిపోతాయి జాగ్రత్త !

సుబ్బ : నాకూ ఫస్టుషోలంటేనే ఇష్టమండీ చక్కగా స్నానం చేసి హొటల్లో టిఫిన్ తిని, రిక్షా ఎక్కి, ఇస్త్రీ చీర కట్టుకుని....

కృష్ణ : స్నానంచేసి హొటల్లో టిఫిన్ తిని, రిక్షా ఎక్కి ఇస్త్రీచీర కట్టుకోవడమేమిటి ? అందుకే ఆ దిక్కుమాలిన సినిమాలు చూడొద్దనేది.

సుబ్బ : సర్లేండి – సెన్సారాఫీసర్లాగా గుళ్ళో కూడా బూతుకోసం వెతకడం మీకు బాగా అలవాటైంది. సరే ! ఇస్త్రీ చీర కట్టుకుని, టిఫిన్ తిని, రిక్షా ఎక్కి మధ్యలో పూలు కొనుక్కొని, సినిమాకెళితే ఎంత హాయిగా వుంటుందండి.

కృష్ణ : నే చెప్పేది – ఈ కార్యక్రమమంతా నెలకొక్కసారే అని, తల కెక్కిందా ?

సుబ్బ : పోన్లేండి – దేవుడు నాయందున్నాడు. నెలకొక్కసారైనా వొప్పుకున్నారు.ఏం చేస్తాం. మిగతా రోజుల్లో మా నాన్నిచ్చిన డబ్బులు పెట్టి చూస్తా.

కృష్ణ : అంతేగాని సినిమాలు చూట్టం మాననంటావ్ ?

సుబ్బ : అది నావల్ల అయ్యేపనా కృష్ణా ?

కృష్ణ : అమ్మ – నీ దుంపతెగ – సినిమాడైలాగు.

సుబ్బ : భార్యాభర్తలంటే రైలు పట్టాలు కావండి. పొయ్యిమీదున్న నీళ్ళు పాలు వంటివాళ్ళు చిల్లుపడ్డ కుండలా అన్నీ చెప్పేసుకోవాలేగాని ఇత్తడి గంగాళంలాగా దాచుకోకూడదండి.

కృష్ణ : మళ్ళీ సినిమా డైలాగు.

సుబ్బ : మనసు, మమత, అనురాగం లేని దాంపత్యం, పత్యం తిండి లాంటిది, ఉప్పుకారం లేని కూరలాంటిది, నా గుండెల్లో ఫటేల్‌మంటున్న ఈ అగ్నిపర్వతాన్ని చూడవా కిరణ్.

కృష్ణ : కిరణా, వాడెవడే ?

సుబ్బ : నా మనస్సు బాధపడ్డప్పుడల్లా మిమ్మల్నా పేరుతోనే పిలుస్తా ఇకనుంచి

కృష్ణ : ఏమో అనుకున్నాగాని బాగా ముదిరింది పిచ్చ, లక్షణమైన కృష్ణ మూర్తిని కిరణ్‌ని చేసావ్. సంసారపక్షం భాషపోయి, సినిమా భాష పట్టుకున్నావ్ – సినిమాలకెళ్ళద్దే అంటే మా నాన్న డబ్బుల్తో వెళతానంటున్నావ్ అయిపోయింది – అంతా అయిపోయింది.

సుబ్బ : నన్నర్థం చేసుకో కిరణ్ ! అపార్థాల చీకట్లోంచి, అనురాగపు వెన్నెల్లో కెడదాం పద.

కృష్ణ : అలాగే పోదాం పద – కాని అనురాగపు వెన్నెల్లోకి కాదు – బస్టాండుకు పెట్టి సర్ది.

సుబ్బ : ఆవేశపడకు కిరణ్ ! అర్థం చేసుకోవాలేగాని ఇద్దరం కళ్ళులోకి చూసుకుంటూ, ప్రేమ తిని బతకుదాం.

కృష్ణ : అలాగే అలాంటిదేవన్నా బాలన్సుంటే పొట్లం కట్టుకో, బస్సులో తిందుగాని నడు.

సుబ్బ : తప్పదా కిరణ్.

కృష్ణ : తప్పదు – సుబ్బలక్ష్మి–

( సుబ్బలక్ష్మి రివ్వున గోడకున్న ఫోటోవైపుగా పరుగెత్తింది )

సుబ్బ : హే భగవాన్ ! ఏమిటయ్యా ఇదంతా, ఏజన్మలో ఎవరి సినిమా మోజుని దెబ్బతీసానో, ఈ జన్మలో నా సంసారమే దెబ్బ తింటోంది. ఎందుకు నన్నిలా పరీక్ష చేస్తున్నావ్ ? గుండెకోసి గారడి చేస్తున్నావ్, చెప్పవయ్యా చెప్పు ?

( కృష్ణమూర్తి నడుంపై చూతులుంచుకుని తాపీగా )

కృష్ణ : అయిందా – ఇహపద– పెట్టి సర్దుకో – బస్సుకి వేళయింది.

సుబ్బ : ఇదే మీ ఆఖరి మాటా ?

కృష్ణ :  ఆఖరిమాట చెప్పటానికి  నేనే గుటగుటలాడుతున్నాను. ఇదిగో చూడు కట్టుకున్న దానివన్న కనికరం కొద్దీ చెపుతున్నా – ఈ కొంపలో  ఉండాలంటే నాతో సంసారం చేయాలంటే  నే చెప్పినట్లు చేయాలి.  నెం – 1 నెలకో సినిమా మాత్రమే  చూడాలి చెప్పు.

సుబ్బ :  ఈ కొంపలో వుండాలంటే  నాతో సంసారం చేయాలంటే నే చెప్పినట్లు చేయాలి. నెం – 1 నెలకో సినిమా మాత్రమే చూడాలి.

( కృష్ణమూర్తి తల పట్టుకున్నాడు )

కృష్ణ : నెం.టూ.ఫస్టుషోకి మాత్రమే వెళ్ళాలి.

సుబ్బ : నెం.టూ.ఫస్టుషోకి మాత్రమే వెళ్ళాలి. ఒక వేళ మీరు యెప్పుడన్నా మార్నింగు షో అని ముచ్చటపడితే ?

కృష్ణ : పడనుగాక పడను. ఒకవేళ ఎప్పుడైనా సావాసదోషం చేసి బుద్ధి గడ్డి తింటే మొహం వాచేటట్లు చీవాట్లు పెట్టు. యిహ నెం.త్రీ. సినిమా డైలాగులు ఆపేయాలి. కళ్ళల్లోకి చూసుకోటాలు, ప్రేమ తిని బతకటాలు, గోడలకుండే ఫోటోలతో బాతాఖాని వెయ్యటాలు పనికిరావు.

సుబ్బ : అబ్బా – ఈ గొట్టం డైలాగులేమిటండి బాబు. ఆఖరి సీన్లో దర్శకుడు కనిపించి చెప్పినట్లు.

కృష్ణ : అదే ఇంతసేపు నే చెపుతుంది – ఆ ధోరణిని మార్చుకో  ఇహ నెం. ఫోర్ – నన్ను కృష్ణమూర్తి అనే పిలవాలి. అవేశం వచ్చినా  ఆనందం వచ్చినా, అలానే పిలవాలిగాని కిరణ్, సుధాకర్, రమేష్ లాంటి సినిమా పేర్లతో పిలవనే కూడదు.

సుబ్బ : అర్ధమయిందండి – ఇలా షరతులు పెట్టి నాకాళ్ళు చేతులు నోరు కట్టేస్తున్నారన్నమాట సరే కానివ్వండి – నేనూ చూస్తా

( వెళ్ళి పోబోయింది )

కృష్ణ : ఆగాగు  – ఇంకా వున్నాయి నెం. ఫైవ్ – ఇలా షరతులు పెట్టానన్న కోపంతో కూరల్లో ఉప్పు, కారాలు, వెయ్యకపోవటం, చొక్కాకి గుండీలు కుట్టమంటే మర్చిపోయాననటం, రాత్రిపూట తల నొప్పి అని ముసుగుతన్నటంలాంటి ప్రతీకార చర్యలు పనికిరావు – అలా జరిగితే బస్సెక్కించేస్తా.

సుబ్బ : బలంతో సింహాన్ని బంధించగలరు కాని పువ్వును పూయించలేరండి.

కృష్ణ : ఇంతసేపు చెప్పిన సోదంతా గాలికి పోయింది – మళ్ళీ మొదలు ఇదిగో యిప్పుడే చెపుతున్నా ఈ పంచ సూత్రాలను ప్రక్కన పెట్టినట్లు తెలిసిందా నీకు నాకు చెల్లు – వెళ్ళు – వెళ్ళి పన్నూసుకో.

సుబ్బ : పెను చీకటాయేలోకం, చెలరేగే నాలో శోకం

( అని పాడుకుంటూ లోనికెళ్ళిపోయింది )

( కృష్ణమూర్తి తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు. కాస్సేపటికి లేచి ఫైలుని చేతిలోకి తీసుకుని బయల్దేరిపోతుండగా – బయట్నించి కృష్ణా – ఆపద్బాంధవా – అనాథ రక్షకా అని వినిపించటంతో స్టేజిపైకొచ్చేడు – వస్తూనే )

సూరి : జగద్రక్షాధీన బంధు పాహిమాం పాహి.

కృష్ణ : ప్రొద్దున్నే ఇలా తగులడ్డావ్ – పనుంటే ఆఫీసులో కలవొచ్చుగా.

సూరి : గొప్ప చిక్కుల్లో పడ్డాను కృష్ణా, నువ్వే చక్రం అడ్డెయ్యాలి.

కృష్ణ : అలాగే వేద్దును, కాని చక్రం తాకట్టులో వుంది – అంచేత నడు ఆఫీసుకి.

సూరి : అలా దులుపోమాకు చెప్పేది విను.

కృష్ణ : ఆఫీసుకి టైమయింది వెడుతూ దోవలో మాట్లాడుదాం పద.

సూరి : నాకొచ్చిన కష్టం సామాన్యమైనదికాదు. అది పగవాడిక్కూడా రాకూడదు. బస్సుల్లో ఆఫీసుల్లోను రోడ్లపైన మాట్లాడుకునే బాసమ కాదు. అంచేత ఒక్క క్షణం కుదురుగా నిలబడు చెప్పేది విను.

( కృష్ణ మూర్తి ఆందోళనగా ముఖం పెట్టాడు. )

కృష్ణ : ఏమిట్రా అది, మీ నాన్నకెలా వుంది.

సూరి : మా నాన్నకేరా – నిక్షేపంలా కంచు చెంబులా వున్నాడు. కోడలొస్తే ప్రాణగండం ఉందని. ఎవడో చిలకజోస్యం చెప్పాట్ట అంచేత నాకు పెళ్ళి చేయకుండా తను బతికేస్తున్నాడు. నన్ను చంపేస్తున్నాడు.

కృష్ణ : ఇంతకీ అదే నా నీ వర్రీ.

సూరి : కొంప కొంపకి తిరిగి అడుక్కునే వెధవకి ఒక్క వర్రీ ఏవిటి జీవితమే పెద్ద వర్రీ.

కృష్ణ : ఉదయం లేచి ఎవడి మొఖం చూసేనోగాని ఇప్పటిదాకా అది కాల్చుకుతింటుంది. ఇపుడు వీడొచ్చాడు. విషయం చెప్పడు సమస్యంటాడు. అడుక్కు తినడం అంటాడు అర్థం కావటంలేదు.

సూరి : అవున్రా – అలానే తయారైంది. నా బతుకు ఇపుడు నీ వద్దకొచ్చింది గూడా బిక్షేరా.

కృష్ణ : బిక్షా. ఏం భిక్షరా.

సూరి : రతిబిక్ష, రతిబిక్ష

కృష్ణ : ( అనుమానంగా ) ఏమిటన్నావ్ ?

సూరి : రతిబిక్ష, రతిబిక్ష.

కృష్ణ : ఏరా వొళ్ళుగాని కొవ్వెక్కిందా – నా ఇంటికొచ్చి నన్నే రతిబిక్ష అడుతున్నావంట ఏంటి నీ ఉద్దేశ్యం – మంచి చెడు, తన మన, వుచ్చం నీచ్చం ఉండక్కర్లా.

సూరి : కృష్ణా అపార్ధాలు లాగి అన్యాయం చెయ్యకు కష్టంలో వున్నా కనికరించు.

కృష్ణ : ఒరే సూరి నాకు ఒక్క ముక్క గూడా అర్ధం కాలేదు. అయినా పతిబిక్ష విన్నాం, ప్రాణ బిక్ష విన్నాం, పదవి బిక్ష గూడా వింటున్నాం కాని ఇదెక్కడి రతిబిక్షరా.

సూరి : ఏం చెప్పమంటావ్ – మా నాన్న పుణ్యమాని ఇలా బిక్షలు చేసుకుంటూ సన్యాసి వెధవలా బతకుతున్నా, ఆలస్యం చెయ్యకు బయట ఆటో వుంది దాంట్లో అమ్మడుంది. కాస్సేపు ఇల్లు ఇచ్చి పుణ్యం కట్టుకో – నీ పేరు చెప్పి దీపం ఆర్పుకుంటా.

కృష్ణ : అమ్మా వెధవా – అదా నీ కష్టం – అయినా దొరక్క దొరక్క నా కొంపే దొరికిందా, ఇటువంటి అడ్డమైన పన్లకి.

సూరి : అలా అనకు కళ్ళు పోతాయ్, లెంపలేసుకో ఉదయం ఏడింటికి ఆటోని అమ్మడ్ని చేత్తో పుచ్చుకుని బయల్దేరా అన్ని కొంపలు తిరిగి తిరిగి నీవే తప్ప హిత:పరం బెరుగ అన్నట్లు నీ దగ్గరకొచ్చా.

కృష్ణ : ఆ పతంజలి గాడింటికి వెళ్ళలేకపోయావ్ ఒంటిరి పక్షేగా.

సూరి : వెళ్ళాను. కాని పాట్నర్ షిప్ అడిగాడు. పరుగెట్టు కొచ్చేసా.

కృష్ణ : అందరూ అందరే వెధవలు పోనీ సత్తిరాజు గాడి కొంపకి.

సూరి : అబ్బా అక్కడికి వెళ్ళొచ్చా. చలి జ్వరంట. ముసుగు తన్ని పడుకున్నాడు. పర్వాలేదు. కానీమన్నాడు. ధైర్యం చాలింది కాదు ఇలా వచ్చేసాను. నువ్వు కాదంటే – ఈ విశాల ప్రపంచంలో చోటే దొరకదు. సృష్టి కార్యం కాదనకు.

కృష్ణ : ఒకే సూరి నేనూ నీలాగా బ్రహ్మచారి వెధవనైతే అలాగే అనుండేవాడ్ని కాని ఎలా కుదురుతుంది ? ఈ విషయం మా సుబ్బకి గాని తెలిస్తే నిన్ను నన్ను కలిపి రేపు పెడుతుంది. అపుడు జాయింటుగా ప్రాణబిక్ష అడగాలి. అంచేత సారీ,

సూరి : అయితే సిస్టర్‌ని అడిగెయ్యనా, అడవాళ్ళకు జాలెక్కువ అంటారు
( లోనికి వెళ్ళబోయాడు )

కృష్ణ : ఒరెరె ఆగాగు కొంపలంటుకుంటాయి ఇప్పుడే పంచసూత్రాలు చెప్పి లోనికి పంపించాను, పలకరిస్తే పళ్ళు రాలగొట్టేలా వుంది.

సూరి : పళ్ళు రాలినా పని పూర్తయితే చాలు. అయినా ఎలాగు కేకలేసానంటున్నావ్. కాబట్టి పశ్చాత్తాపం ప్రదర్శించి మార్నింగుషోకి పట్టుకెళ్ళు.

కృష్ణ : ఇప్పటిదాకా ఆ విషయంపైనా రభసయ్యి గట్టిగా వార్నింగిచ్చి పంపాను. అది కుదర్దు ఇంకో కొంప చూసుకో.

సూరి : నీకు పుణ్యం వుంటుంది. బంగారం లాంటి ఛాన్సు మళ్ళీ మళ్ళీ రాదు నీ కాళ్ళు పుచ్చుకుంటాను ( అని కాళ్ళపైన పడ్డాడు )

కృష్ణ : ప్రొద్దున్నే ఇదెక్కడి గొడవరా – గొప్ప ఇరకాటంలో పెడుతున్నావ్‌రా – కాదంటే కాళ్ళమీద పడుతున్నావ్. అవుననటానికి సంసారం చేసుకునేవాళ్ళకి సవాలక్ష ఇబ్బందులు. అవన్నీ నీకు తెలీవు.

సూరి : హాయిగా మీ ఆవిడిని తీసుకుని సినిమాకెళ్ళరా ఎవరికీ ఏ ఇబ్బంది ఉండదు, సర్వేజనా సుఖినో భవంతు.

కృష్ణ : మార్నింగ్ షోలకెడితే బస్సెక్కిస్తానని చివాట్లు పెట్టిన నేనే పిల్చి మార్నింగ్ షో కెడదాం పదమంటే పెళ్ళాం ముందు పరువేంకాను.

సూరి : పెళ్ళాం దగ్గర పరువేమిటోయి ఎంత పెళ్ళి కాకపోయినా మాకు కొన్ని కొన్ని తెల్సు – పనులే ముఖ్యం అనుకునే వాడెవడు పెళ్ళి చేసుకోడు. సుబ్బరంగా సన్యాసం పుచ్చేసుకుంటాడు. సరే ఓ పన్చెయ్యి మీ ఆవిడ్ని పిలు సీరియస్‌గా మొహం పెట్టు. సుబ్బలక్ష్మీ క్షణం క్రితం నేను నేను కాదను అసలేం జరిగిందో తెలీదను ఏం జరిగిందో తెలీదను ఏం జరిగిందని అడిగి తెల్సుకో, జరిగిందానికి కాస్సేపు బాధపడు, సరే ఏ సినిమావల్ల నేను నేను కాకుండా ప్రవర్తించానో ఆ సినిమాకే వెళదాం పదమను ఫినిష్.

కృష్ణ : వెధవ సలహాలు బాగానే ఇస్తావ్ రేపట్నుంచి అది పెట్రేగి రోజుకు మూడాటలు చూస్తే అవస్థ పడేది నేను నీకేం నిక్షేపంలా వుంటావ్.

సూరి : ఒరే ఫ్రెండ్ కోసం ఆ మాత్రం చెయ్యలేవా ? గుర్తుందా నీకు పెళ్ళి కాకపూర్వం మనాఫీసులో  ఆ ఎర్ర పిల్ల సినిమా కెడదామని నిన్ను పిల్చినపుడు డబ్బుల్లేక కాదురా నువ్వు తెల్లముఖం వేసుక్కూచుంటే నా డబ్బుల్తో మీ ఇద్దర్ని రిక్షా ఎక్కించిపంపాగదరా.

కృష్ణ : ( భయంగా ) అరవమాకు వెధవ గొంతు నువ్వాను నాకూ సహాయం చెయ్యాలనే ఉంది కాని సమయానికి  డబ్బులు గూడా లేవు.

సూరి : వదిలెయ్. మిగతావన్నీ  నాకొదిలేయ్. సినిమా టిక్కెట్లు ఖర్చు, రిక్షా కిరాయి. కాఫీ హోలు బిల్లు అన్ని నా ముఖాన తగలెయ్యి.

కృష్ణ : అంటే నువ్వుగాని ఇస్తావా ?

సూరి : తప్పుతుందా – అవసరం నాది. ఎలాగూ నువ్వు నాకో మూడొందలు ఇవ్వాలిగా ఈ ఖర్చంతా దాంట్లో జమేసుకోరా.

కృష్ణ :  సరిపోయింది, గాత్రం బాపతా – అయితే కష్టంరా సూరి.

సూరి : ఆగాగు అలా తొందరపడి నిర్ణయాలు చేసేస్తావేరా, సరే, ఇదుగో నీ దగ్గరుంచు. ( అంటూ ఇరవై కాగితం తీసి కృష్ణమూర్తి జేబులో కుక్కాడు )

కృష్ణ : ఏమిటోరా, ఎంతైనా సుబ్బుల్ని  పిల్చి సినిమాకని చెప్పాలంటే గొప్ప అసహ్యంగా ఉందిరా.

సూరి : అదేమిట్రా పరాయివాడి పెళ్ళాంతో సినిమాకెడుతున్నట్టు అంత భయపడతావ్. అప్పుడు అయితే ఆ ఎర్రపిల్ల.

కృష్ణ : నోరుమూసి నువ్వెళి బయట తగలడు – ఆ ఆటోని  గడపలో తీయించు – ( సూరిబాబు వంగి వంగి, సలాం చేస్తూ వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తి కాస్సేపు ఏదో ఆలోచిస్తూ అటూ యిటూ  పచార్లు చేసాడు. ఆ పైన  నిర్ణయానికి వచ్చినట్లు – సుబ్బలక్ష్మి సుబ్బలక్ష్మి అంటూ పిలిచాడు సుబ్బలక్ష్మి వచ్చింది. నిండుగా కొంగు కప్పుకొని )

సుబ్బ : పిలిచారా – ఇంకా ఆఫీసుకు వెళ్ళలేదా ?

కృష్ణ :  లేదు సుబ్బులు, నిన్ను తొందరపడి నానా మాటలు అన్నాను బస్సెక్కిస్తానని బెదిరించాను కూడాను. మనసు పాడైంది. అడుగు బయట పెట్టగానే ఆవేదన మొదలైంది.

సుబ్బ : అలా బాధ పడకండి – భర్తంటే ముల్లుకర్రలాంటివాడు. అప్పుడప్పుడు అలా పొడుస్తుంటే గాని భార్యలకు బుద్ధి రాదండి బాధ పడకుండా ఆఫీసుకు వెళ్ళండి.

కృష్ణ : వెళ్ళలేను సుబ్బులూ – ఈ బాధని మోసుకుంటూ ఆ బస్సుల్లో పడిపోలేను.

సుబ్బ : పోనీ ఆటోలో వెళ్ళండి – అంతేగాని అంతలా బాధపడకండి – నిజానికి కేకలేసినా కళ్ళు తెరిపించారు. మార్నింగ్ షోల్లో మాధుర్యం లేదని, నెలకోసారైనా మొగుడితో మొదటాటకెడితేనే ముచ్చటగా వుంటుందని తెల్సుకున్నానండి.

కృష్ణ : చాలు సుబ్బులూ చాలు – నన్నామాత్రం అర్ధం చేసుకున్నావు. ధన్యుణ్ణి ఇక వెడదాం పద.

సుబ్బ : ఎక్కడికండి బస్టాండుకా ?

కృష్ణ : ఛ ఛ కాదు – మార్నింగ్ షోకి

( సుబ్బులు ఆశ్చర్యంగా భర్తవంక చూసింది )

సుబ్బు : మీరేనా మాట్లాడుతుందట.

కృష్ణ : అవున్నేనే చేసిన పాపం ఇలా నిన్ను సినిమాకి తీసుకెడితేగాని పోదు, త్వరగా పద.

సుబ్బ : వద్దండి – ముగిసిన కథని మళ్ళీ మొదలెట్టకండి. మార్నింగుషోలని మర్చిపోనివ్వండి.

కృష్ణ : ఈ ఒక్కసారికి వెడదాం పద – కాదనకు బయల్దేరు.

సుబ్బ : అర్ధమైందండి – అంతా అర్ధమైంది – ఎందుకిలా నన్ను సినిమాకని తొందర చేస్తున్నారో బాగా అర్ధమైందండి.

కృష్ణ : ( కంగారుగా ) ఏమిటి అర్ధమైందా – ఏం అర్ధమైంది – ఎలా అర్ధమైంది చెప్పు.

సుబ్బ : అయిదేళ్ళుగా కాపురం చేస్తూ ఆ మాత్రం అర్ధం చేసుకోలేననుకున్నారా ?

కృష్ణ : ఇంతకీ నీకర్ధం అయిన విషయం చెప్పావుకదా.

సుబ్బ : అబ్బ – తెలీనట్లు ఏం నాటకం ఆడతారండి. మీరు చెప్పిన ఈ పంచసూత్రాలు గుర్తున్నాయో లేదోనని, సినిమాకన్చెప్పి పరీక్ష చేస్తున్నారు. అవునా ?

( కృష్ణమూర్తి జేబులోంచి ఖర్చీఫ్ తీసి మొహం తుడుచుకున్నాడు )

కృష్ణ : పరీక్షలేదు పాప నాశనం లేదు. అసలు పరీక్ష నీక్కాదు – నాకు – త్వరగా బయల్దేరు టైమైంది.

సుబ్బ : పంచసూత్రాల్లో రెండో సూత్రం ప్రకారం ఇప్పుడు మిమ్మల్ని కుక్కచివాట్లు పెట్టే అధికారం నాకుంది. కాని ఆడది అధికారంలో ఉన్నా అణిగిమణిగి వుంటుంది అదేనండి భారత స్త్రీ గొప్పతనం.

కృష్ణ : ( కోపంగా ) ఓ భారత స్త్రీ నీకో దణ్ణం – ఇంకో మాట మాట్లాడేవంటే గంగలో మునిగి కాషాయం కట్టేస్తా.

సుబ్బ : మార్నింగుషోకి వెళ్ళక తప్పదా పంచసూత్రాలు ప్రపంచానికేగాని మనక్కాదా ?

కృష్ణ : వెళ్ళకతప్పదు – కాదన్నావంటే కాశీబండి ఎక్కేస్తా.

( సుబ్బలక్ష్మి రివ్వున మళ్ళీ గోడకున్న ఫోటో వైపు పరిగెత్తింది )

సుబ్బ : హే భగవాన్ ఏవిటయ్యా నీ లీలలు, క్షణం క్రితం సినిమాకెడితే బస్సెక్కిస్తాననన్న మనిషి ఇప్పుడు సినిమాకు రానంటే కాశిబండి ఎక్కుతానంటున్నారు. ఏమిటో విచిత్రం – నిజంగా నువ్వు సమర్థుడవయ్యా, ఏమైనా చెయ్యగలవు. నువ్వున్నావని ఇంకోసారి ఋజువు చేసావ్.

కృష్ణ : సుబ్బులూ – త్వరగా తెములు – స్వామివారు గోడకే వుంటారు వచ్చాక వూదుకడ్డీని వెలిగిద్దువుగాని.

సుబ్బ : ఏవిటో ...మీకేం వచ్చినా పట్టలేం – పోనీ చల్లబడ్డాక మొదటాటకెల్దాం.

కృష్ణ : చల్లబడ్డానికే ఈ తిప్పలన్నీ – వెళ్ళు – వెళ్ళు చీర మార్చుకురా త్వరగా

సుబ్బ : సరే మీ ఇష్టం మొగుడ్ని చూస్తూ చూస్తూ ఏ భార్య కాశిబండి ఎక్కనివ్వదు క్షణంలో వచ్చేస్తా

( అంటూ లోనికెళ్ళింది )

( వెంటనే సూరి స్టేజిపైకొచ్చాడు )

సూరి : ఏరా ఎంతసేపు, వెళ్ళేది సినిమాకా, తీర్థయాత్రలకా,

కృష్ణ : పలకరించావంటే పళ్ళు రాలగొడతా నీ వల్ల గదరా పెళ్ళాం ముందు పిచ్చి వెధవనయ్యాను.

సూరి : ( సీరియస్‌గా ) పోన్లేరా నీకంత కష్టంగా వుంటే వద్దులే. ఫ్రెండు కదా అని అడిగాను. పోన్లే – మర్చిపో. నాకివ్వాల్సిన ఆ మూడొందలైనా తగలెయ్యి ఏ లాడ్జింగులోనో తిప్పలు పడతా.

కృష్ణ : ( గాబరాగా ) ఛ ఛ అవేం మాటలురా – ఏదో చనువుకొద్దీ అన్నానంతే – పట్టించుకోకు. ఫ్రెండన్నాక ఆ మాత్రం సాయం చెయ్యకపోతే ఎలా ?

సూరి : థాంక్స్‌రా – మళ్ళీ మనకి మనషి జన్మంటూ వుంటే పెళ్ళికాక మునుపే నీ కడుపున పుట్టి తండ్రిని చేస్తా.

కృష్ణ : నోరువిప్పితే కారు కూతలు – పిచ్చి కూతలు నీ నోటిని ఫినాయిలు పెట్టి కడిగించాలి ( అంతలో సుబ్బలక్ష్మి తిరిగొచ్చింది, చీర మార్చుకుంది – చేతిలో హేండుబ్యాగు ఉంది )

సుబ్బ : ( హేండు బ్యాగ్ తీసుకొస్తూ ) ఏవండీ ఈ చీరే బాగానే వుందిగా రండి వెళదాం – ఓ సూరిబాబుగారా బావున్నారా ?

సూరి : గొప్పగా వున్నాం. అవునూ ఎక్కడికో ప్రయాణం అయినట్లున్నారు ?

సుబ్బ : మీ ఫ్రెండు నడగండి చెపుతారు.

సూరి : ఏరా సినిమాకా, షికారుకా ?

కృష్ణ : ( కోపంగా ) సినిమాకేనండి సూరిబాబుగారు.

సూరి : గుడ్ –బాగుందిరా – ఫ్రెండ్సుని గౌరవించటం నేర్చుకున్నావ్. పెళ్ళాం అడగంగానే ఆఫీసుకు నాగాపెట్టి తీసికెడుతున్నావ్. పైకొచ్చే లక్షణాలు కనిపిస్తున్నాయ్

సుబ్బ : నేనడగలేదండి ఆయనే తీసికెడుతున్నారు కదండి – నేనయితే ఫస్టు షో కెడదామని చెప్పా, చల్లబడ్డాక, స్నానం చేసి, ఇస్త్రీచీర కట్టుకుని, హోటల్లో టిఫిన్ తిని రిక్షా ఎక్కి.

సూరి : టాపు వేయించుకుని

సుబ్బ : కరెక్టు. మధ్యలో పూలు కొనుక్కుని సినిమాకెడితే ఎంత హాయిగా ఉంటుందండి – అబ్బా – అందుకే ఫస్టు షో అంటే బెస్టు షో అనిపిస్తుంది.

సూరి : అరె సరిగ్గా నాకు అలానే అనిపిస్తుంది, చల్లబడ్డాక, సినిమాగాని ఎర్రటి ఎండలో ఏవిటండి ?

కృష్ణ : ఒరే సూరీ.....

సుబ్బ : కాని మీ ఫ్రెండు అదేవిటోగాని మార్నింగ్ షోనే అంటారు. కాని నే వెడతానంటే కేకలేస్తారు. బస్సెక్కిస్తానంటారు.

సూరి : ఏరా... సిస్టర్ ఫస్టుషో అంటే నువ్వేమో మార్నింగ్ షో అంటావా ? ఆవిడ వెడతానంటే కేకలేసి బస్సెక్కిస్తానని బెదిరింపా – ఆ మాత్రం తెలియదు, ఇంకెప్పుడురా బుద్ధొచ్చేది ?

కృష్ణ : సూరీ... అవస్థల్లో పడతావ్.

సూరి : నాన్సెన్స్ మీరు మొదటాటకెడితే నాకవస్తలేవిటోయ్.

సుబ్బ : ఉదయం నుంచి అదే వరసండి, ఇప్పుడున్న మాట మళ్ళీ క్షణానికి ఉండదు. ఏవిటో చిత్రంగా ప్రవర్తిస్తున్నారు. సినిమా అంటే కస్సుమన్నారు. సర్లే అనుకున్నా, మార్నింగుషోకెడితే బస్సెక్కిస్తానన్నారు. ఊరుకున్నాను పైగా పంచసూత్రాలన్నారు. అలాగే నన్నా. మళ్ళీ ఇప్పుడు తనే పిల్చి మార్నింగ్ షో కెడదాం పదమంటున్నారు. దీన్నేవంటారు ?

సూరి : ఇదేదో గొప్ప డేంజరు వ్యవహారం లాగుంది. దీన్నేవంటారో చెప్పాలంటే తెలుగు రచయితలే చెప్పాలి. ముఖాముఖి శీర్షికకు ప్రశ్న పంపండి. అయినా మాట నిలకడలేని వెధవలు పెళ్ళిల్లెందుకండి చేసుకోటం ?

( కృష్ణ ఇద్దరివంక కోపంగా చూసి ఠపీమని కుర్చీలో కూర్చుని )

కృష్ణ : సుబ్బలక్ష్మీ సినిమా కేన్సిలు – ఫస్టుషోకే పోదాం.

సుబ్బ : చూశారా ! చూసారా ఇదీ వరస.

సూరి :ఏరా పంచసూత్రాలు చెప్పటం, పక్కన పెట్టేయటం, సినిమాకు పోదాం అనటం, తీరా బయలుదేరేవేళకీ కేన్సిలనటం, అదేవిటంటే బస్సెక్కిస్తానని బెదిరించటం, అంతా నీ యిష్టమేనా ? ఇది యిల్లనుకున్నావా ? ఇండియా అనుకున్నావా ? సర్లే..... బయల్దేరారు కాబట్టి ఈ ఒక్కసారి కానిచ్చి గట్టెక్కించు ( అని సుబ్బలక్ష్మి వేపు తిరిగి ) ఈ సారినించి ఫస్టుషోకయితేనే వస్తానని కాస్త బెట్టు చేసి వెధవకి నట్టు బిగించండి. పదండి అలా చూస్తావేరా బయట ఆటో...

సుబ్బ : ఏవిటి అప్పుడే ఆటో గూడా పిల్చారా ?

కృష్ణ : అబ్బె టైమయింది. ఆటోలో పొమ్మని వెధవ సలహాలు, వెధవ బిక్షలు.

సుబ్బ : బిక్షలేవిటండి.

సూరి : అంటే వాడుద్దేశం, మీరివ్వాళ సినిమాకెడతానికి కారణం నేనే అంచేత అది నే పెట్టిన బిక్షని.

సుబ్బ : సరే ఉండండి – తాళం పట్టుకొస్త

( లోనికెళ్ళబోయింది )

కృష్ణ : తాళం వద్దు, పల్లవి వద్దు పద వెళదాం.

సుబ్బ : ఇదేవిటండీ కొంపకి తాళంగూడా వెయ్యొద్దంటారా ?

సూరి : తాళం ఎందుకు సిస్టర్ , మీరొచ్చేదాకా నేను ఎలాగో ఉంటాగా ?

సుబ్బ : మీరా ?

సూరి : రోజులేం బాగాలేవు తాళం తాళంగానే వుంటుంది. ఇల్లంతా దోచుకుపోతున్నారు. అంచేత నే కాపలా వుంటా. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి.

సుబ్బ : మీకెందుకండీ శ్రమ.

కృష్ణ : శ్రమలేదు శనక్కాయ లేదు. వాడు మనింట్లో కూర్చోని మనం వచ్చేదాకా చదువుకుంటాడట.

సూరి : అవునండి పరీక్షలొచ్చిపడుతున్నాయ్.

సుబ్బ : ఆఫీసు పరీక్షలా ?

సూరి : అవును సిస్టర్ ఏదో పరీక్ష పాసవుతే ప్రమోషనొస్తుందని ఆశ.

సుబ్బ : చూశారా అదండి అది పైకొచ్చేవాళ్ళ లక్షణం, మీరూ ఉన్నారు. మీకసలు ఆ ధ్యాసేలేదు.

సూరి : అబ్బే అస్సలేల్లదండి.

కృష్ణ : సూరి యెక్కువ వాగుతున్నావు – కార్యక్రమం దెబ్బ తింటుంది.

సుబ్బ : కార్యక్రమమా ?

సూరి : అదేలెండి, చదువు, పరీక్షలు, ప్రమోషన్‌లు అని వాడుద్దేశం. సరే ఇవాళ్టికి తీసుకెళ్ళండి. రేపట్నించి వెధవని గోడకుర్చీ వేయించి నే చదివిస్తాగా.

సుబ్బు : సరే పదండి –

( సుబ్బలక్ష్మి ముందు వెళుతూ )

కృష్ణ : ఒరే కొంప జాగ్రత్త ఆ మంచాలు, పరుపులు శివతాండవం చేయక ఏదో సంసారపక్షంగా పో.

సూరి : దేన్ని గురించి దిగులుపడక పార్వతీ పరమేశ్వరుల్లాగా సినిమాకి క్షేమంగా వెళ్ళి లాభంగా నడచుకుంటూ రండి మిగతావన్నీ నా కొదిలెయ్యండి

( సుబ్బలక్ష్మి వెళ్ళిపోయింది. కృష్ణమూర్తి గూడా వెళ్ళి మళ్ళీ వెనక్కొచ్చాడు. వచ్చి )

కృష్ణ : ఒరే ఇదే మొదటిసారి, ఆఖరు సారీను. మళ్ళీ ఎప్పుడన్నా రతి బిక్షలు, మన్మధ బిక్షలు అన్నావంటే మక్కెలిరగ తంతా. ( వెళ్ళిపోయాడు )

సూరి : హమ్మయ్య ఎనిమిదింటికి బయల్దేరితే పదకొండుంటికి ఓ కొంపవాడి నయ్యాను ( సెంటు పూసుకుంటూ ) కాస్సేపు ఈ కొంప, ఆ మంచం, పరుపు ,చెంబు, తెప్పాల అన్నీ మనిల్లే ( బయటికి చూస్తూ ) కమాన్ మై డార్లింగ్ – మై స్వీటీరోజ్ ( మన కష్టం గట్టెక్కింది. మన భోగం పొయ్యెక్కింది. వెల్‌కం – కాసేపు ఇదే బృందావనం అనుకో, నందనవనం అనుకో కమాన్. ( అంటుండగా లైట్సాఫ్ – తిరిగి లైట్లు వెలిగాయి ) ( స్టేజంతా ఖాళీగా ఉంది. లోపల్నించి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. తలుపు తట్టిన శబ్దం అయింది. సూరి లోపల్నించి వచ్చాడు. ప్యాంటు , బనీనుమీదున్నాడు విసుగ్గా మొహం పెట్టి )

సూరి : ఎవరబ్బా వెళ్ళి పావుగంట కాలేదు. అప్పుడే వచ్చేసారా – టిక్కట్లు గాని దొరకలేదా ? ( వెళ్ళి తలుపు తీసాడు. అప్పలనర్సింహం లోపలి కొచ్చాడు. చేతిలో సంచివుంది. పాంటు, షర్టు వేసుకున్నాడు. లోపలికి చొరవగా వస్తూ )

అప్ప : ఉస్స్ – ఏం ఎండలండి – పీల్చేస్తున్నాయ్. ప్రయాణమంటే ప్రాణం పోతోంది ( అనుకుంటూ లోనికొచ్చి తలెత్తి సూరిబాబుని చూసి టక్కున ఆగాడు అనుమానంగా చూస్తూ )

సూరి : ఎవరు కావాలండీ ?

అప్ప : అదే నేనడుగుతుంటా ఎవరు కావాలి ?

సూరి : పోనీ మీ పేరు ?

అప్పు : అదే నే నడుగుతుంటా నీ పేరేమిటి ?

సూరి : గొప్పగా ఉందండి – అడిగిన ప్రశ్నకి చిలకపలుకుల్లా తిప్పి అడిగేస్తున్నారు. చూడండి చిలకరావుగారూ ?

అప్పు : నాన్సెన్స్ – ఏమిటది, జోకులెయ్యకు. తొక్కి నారతీస్తా. నా పేరు అప్పలనర్శింహం.

సూరి : సరే చూడండి అప్పలనర్శింహంగారూ ! బయట్నించి వచ్చింది మీరు అంచేత జవాబు చెప్పాల్సింది మీరు.

అప్పు : అంటే – బయట్నించి వచ్చినంత మాత్రాన పరాయి వాడినయిపోతానా తొక్కి నార తీస్తా ఇంతకీ ఎవర్నువ్వు ?

సూరి : బాబు – మీరెవరైనాగాని సరిగ్గా అమృత ఘడియల్లో వచ్చారు విషయం  చెప్పి సెలవు పుచ్చుకోండి.

అప్పు : అసలు నీతో నాకేమిటి గానీ – తొక్కి నారతీస్తా ఆ వెధవనిటు పిలు.

సూరి : కృష్ణమూర్తినాండి ?

అప్పు : అవును – ఖచ్చితంగా  వాడ్నే

సూరి : చూడండి తిప్పలనర్శింహం గారూ !

అప్పు : ఏమిటది పేర్లే మార్చేస్తున్నావ్. తొక్కి నార తీస్తా – అప్పల... అప్పల నర్సింహం.

సూరి : అదే చూడండి  అప్పల నర్శింహంగారూ, చెట్టంత కృష్ణమూర్తిని పట్టుకుని వాడు వీడు అంటున్నారు కొంపతీసి కృష్ణమూర్తి ఫాదరా ?

అప్పు : గుర్తు పట్టేవుగదా ! తొక్కి నారతీస్తా – ఇహ పిలువాడ్ని

సూరి : మీ అబ్బాయి కోడలు కల్సి మార్నింగ్ షో సినిమాకెళ్ళారండి.

అప్పు : ఏవిటీ – ఆఫీసెగ్గొట్టేసి పెళ్ళాంతో సినిమాకెళ్ళాడా వాడికి బుద్ధిలేకపోతే ఆ పిల్లకన్నా వుండొద్దు ? రాని ఇద్దరిని జాయింటుగా తొక్కి నారతీస్తా.

సూరి : ( కుర్చీముందుకు జరిపి ) అలా కుర్చోండి.

అప్పు : కూర్చోను పని పూర్తయితే గాని  కూర్చోను. ( అంటూనే కూర్చున్నాడు ) ఇంతకీ నువ్వెవరు ? వాళ్ళు లేనపుడు నువ్వేం చేస్తున్నావ్ ?

సూరి : నా పేరు సూరిబాబండి.

అప్ప : సూరిబాబో, చంద్రబాబో ప్రశ్నకి జవాబు చెప్పు.

సూరి : చదువుకుంటున్నానండి.

అప్ప : దేశంలో ఇన్ని లక్షల స్కూళ్ళు, కాలేజీలుండగా చదువుకోవడానికి ఈ కొంపే దొరికిందా – అలా చూస్తావే – తొక్కి నారతీస్తా – చెప్పు.

సూరి : అబ్బే – చదువంటే ఆ చదువు కాదండి ( లోపలికి చూస్తూ ) వేరే రకం చదువండి.

అప్ప : అంటే తిన్నగా అర్థమయ్యేట్టు చెప్పేడు.

సూరి : కృష్ణమూర్తి ఇంట్లో చదువండి – ఆఫీసులో పరీక్షలండి – పాసవుతే ప్రమోషనండి.

అప్ప : మొహం చూస్తే అలా లేదుగాని, బుద్ధిమంతుడివే. మా వెధవని రానియ్యి తొక్కి నారతీస్తా – పరీక్షలకెళ్ళకుండా పెళ్ళాంతో సినిమా కెళ్ళాడా, సరే ఇంతకీ కొంపలో ఒక్కడివే వున్నావన్నమాట.

సూరి : ( లోపలికి చూస్తూ ) అవునండి.

అప్ప : సరే ఓ పక్క కూర్చుని నీ చదువేదో నువ్వేడ్చుకో నా పన్లేవో నే నేడ్చుకుంటా ( అంటూ చొక్కా విప్పబోతూ లోనికెళ్ళబోయాడు )

సూరి : ( కంగారుగా ) ఆగండాగండి – ఎక్కడికండి ?

అప్ప : ఆ ప్రశ్నేమిటి ? ఆ కంగారేమిటి ? ముందు స్నానం చెయ్యాలి – ఆపైన భోజనం చెయ్యాలి, రేడియో వినాలి, కాస్సేపు పడుకోవాలి.

సూరి : అలాగే చేద్దురుగాని, ఓ క్షణం కూర్చోండి కావాల్సిన ఏర్పాట్లన్నీ నే చేస్తాగా.

అప్ప : తొక్కి నారతీస్తా – నా కొంపలో నీ మర్యాదేమిటి నీ చదువేదో నువ్వేడ్చుకోక.

సూరి : నిజమేననుకోండి. కాని మా పన్లు మీరు చేసేసుకుంటుంటే నే చూస్తూ కుర్చున్నాననుకోండి – ఇహ రాత్రికి నే నిద్దరపోనండి.

అప్ప : ఎందుకని ఏమైనా జబ్బా ?

సూరి : జబ్బుకాదండి – జడుపండి – భయవండి.

అప్ప : ఏమిటో ఒక్క ముక్క అర్థమై చావటంలేదు. సరిగ్గా చెపుతావా తొక్కి నారదీయాలా ?

సూరి : అంతపని చెయ్యకండి – అలా కూర్చోండి

( అప్పల నర్సింహం కూర్చుంటాడు )

సూరి : ( హమ్మయ్య అని గాలి పీల్చుకుని ) నాకో ఫాదరుండేవాడండి.

అప్ప : నీకేమిటి ప్రపంచంలో ప్రతివాడికి ఫాదరుంటాడు అది రూలు.

సూరి : అవునండి – కానీ ఇప్పుడాయన లేడండి.

అప్ప : అయితే నన్నేం చెయ్యమంటావ్ – స్నానం మాని సంతాపసభ పెట్టమంటావా ?

సూరి : కాదండి – ఆయన పోతూ పోతూ ఒక తారకమంత్రం చెప్పాడండి నీ కళ్ళబడ్డ పెద్దవాళ్ళందరికీ సేవచేసుకో, వృద్ధిలోకొస్తావ్. పెద్ద వాళ్ళచేత పన్లుగాని చేయిస్తే నా ఆత్మ క్షోభిస్తుంది. కల్లోకొచ్చి తొక్కి నార తీస్తానని బల్లగుద్ది చెప్పి మరీ బాల్చి తన్నేడండి.

అప్ప : అంటే ఇపుడు నా పన్లు నే చేసుకోవటానికి వీల్లేదా ?

సూరి : లేదండి – కనీసం కాలు కదపటానిక్కూడా వీల్లేదండి కదిపేరో కల్లో కొస్తాడండి వచ్చి...

అప్ప : తొక్కి నారతీస్తాడంటావ్ – సరే కానియ్యి. అయితే లోపలికెళ్ళి స్టౌ అంటించి నీళ్ళు పడెయి స్నానానికి.

సూరి : కాని బయట ఎండ దంచి కొడుతోందండి.

అప్ప : ప్రశ్నలడక్కు చెప్పింది చెయ్యి – నాగ్గాని కోపం వస్తే నా పన్లు నేను చకచకా చేసేసుకుంటా అపుడు మీ నాన్నక్కోపం వస్తుంది. నువు నిద్రపోతావ్ ఆయన కల్లో కొస్తాడు – ఆపైన.....

సూరి : తొక్కి నార తీస్తాడు. అద్సర్ – కాని ఎర్రటి ఎండ వేళ వేడినీళ్ళ స్నానం ఏమిటి ?

అప్ప : అదంతే – నా పద్దతే అంత, ఎండాకాలం వేడినీళ్ళు, చలికాలం చన్నీళ్ళు స్నానం చేస్తా టిఫిన్ చేసి, కాఫీ తాగి మొహం కడుక్కుంటా ఎండలో చెప్పులు వాడను వర్షంలో గొడుగు ముట్టుకోను. చీకట్లో చదువుకుంటా – లైటు వేసుకుని పడుకుంటా – పెరుగన్నంలో నెయ్యి కలుపుకుని బూందీ లడ్డూ నంజుకుంటా – పాంటు షర్టు వేసి పైన కండువా వేస్తా, పంచ లాల్చీ తొడిగి టై బిగించి ఫుల్ బూట్లేసుకుంటా, నిక్కరు పైన కోటు తొడుక్కుంటా, నా పద్ధతే అంత ఎవడన్నా నోరెత్తితే....

సూరి : తొక్కి నార దీస్తారు – నాకు తెలుసండి – అంతా అర్థమైందండి. నే వెళ్ళి నీళ్ళు పడేసొస్తా ( అని లోనికెళ్ళిపోయాడు ) ( అప్పల నర్సింహం కుర్చీలోంచి లేచి పచార్లు చేసాడు. ఆపైన ఏదో గుర్తుకొచ్చినట్లు లోనికెళ్ళబోయినంతలో సూరిబాబు ఎదురొచ్చాడు )

సూరి : ఏమిటి – కుర్చీలోంచి లేచారా – మా నాన్న ఆత్మని క్షోభ పెట్టకండి. కాళ్ళు కట్టుక్కూర్చోండి.

అప్పు : ఏమిటి ( కుర్చీలోంచి లేచి ) నా కల్లోకొస్తాడా ? పెద్ద చిక్కొచ్చి పడిందే – కాళ్ళు కట్టేసావ్ – సరే – లోపలికెళ్ళి గ్లాసుడు నీళ్ళు పట్రా – ఇదుగో చూడు ఆ చేత్తోనే ఆ రేడియోగూడా తెచ్చి తగలెయ్యి.

సూరి : రేడియోనా అదెందుకండి ఇప్పుడు ?

అప్పు : కట్టుకున్న పెళ్ళాంలాగా ప్రతిదానికి ప్రశ్నలడక్కు నాక్కోపం వస్తుంది. రేడియో అనంగానే వచ్చి నా ముందర వాలాలి. లేదంటే నేవెళ్ళి తెచ్చుకుంటా. కల్లోకి మీ నాన్నగాని వస్తే నా పూచీ కత్తేం లేదు.

సూరి : అర్ధమయింది. అక్కడ్నించి కదలకండి ( అని లోనికి పరిగెత్తాడు. వెంటనే గ్లాసుడు నీళ్ళతోనూ టు–ఇన్–వన్‌తోను మళ్ళీ వచ్చాడు ) ఇదిగోనండి మంచినీళ్ళు – కాని రేడియో లేదండి – టూ–ఇన్–వన్ వుంది.

అప్పు : ( నీళ్ళగ్లాసందుకుని ) ఓహో – అదమ్మి ఇది కొన్నాడు కాబోలు – వెధవకి చేతులూరుకోవు – అదమ్మి ఇది–ఇదమ్మి అది కొంటుంటాడు. పెద్ద చిక్కొచ్చి పడిందే. భోంచేసి రేడియో వింటేనేగాని కునుకురాదే ఎలా ?

సూరి : భోంచేస్తేగదా రేడియో అవసరం అది మానేస్తే సరి.

అప్పు : ఏవిటది – జోకా – జోకులెయ్యకు– నాక్కోపం వస్తుంది. భోంచెయ్యగానే చెవిక్రింద శబ్దం కావాలి అది వింటేనే గాని కునుకురాదు బతికున్నన్నాళ్ళూ ఆ పని నా పెళ్ళాం చేసేది అది పోయాక రేడియో కొన్నా – సరేకాని ఇవ్వాళ్టికి దీంతో సర్దుకుంటా. ఇంతకీ పన్చేస్తోందా.

సూరి : లేదండి – పాడైనట్లుంది, అసలు పాడైనదే కొన్నానని కృష్ణమూర్తి చెప్పాడండి.

అప్పు : ఓహో – అంటే మంచి వస్తువుల్ని అమ్మి, పాతవి , పాడైపోయినవి కొనుక్కుంటున్నాడన్నమాట, రాని వెధవని తొక్కి నారతీస్తా, అంటే ఈ కొంపలో వాడితోసహా పనికొచ్చే వస్తువేది లేదన్న మాట.

సూరి : అలాగే అనిపిస్తోందండి – చూస్తుంటే.

అప్పు : సరే– ఓపన్జెయ్యి – నీళ్ళు కాగేలోపు – రివ్వున వెళ్ళి రిపేరుచేయించుకొచ్చేయి.

సూరి : నేనాండి ?

అప్ప : అవున్నువ్వె – నేనే వెళ్ళి రిపేరు చేయించుకొద్దును కాని మీ నాన్న కల్లోకొస్తాడేమోనని.

సూరి : బజారు పన్లకి ఆ భయం లేదండి నాలుగ్గోడల మధ్యనే పట్టింపు నీళ్ళు కాగేలోపు వెళ్ళొచ్చెయ్యండి.

అప్ప : ఓహెూ అలా వచ్చావా ? సరే ( అని లేచి లోనికెళ్ళబోయాడు )

సూరి : ( కంగారుగా ) బజారుకి దారి ఇటండి.

అప్ప : ( కోపంగా ) ఆ మాత్రం తెల్సు. – రిపేరుకి ఛార్జీలెవడిస్తాడు ? ఆ బీరువాలో పైకముందేమో చూసొస్తా.

సూరి : షుమారు ఎంతవుతుందండి.

అప్ప : చెప్పలేం – వాచీలు – రేడియోలు – స్కూటర్లు వీటికి ధరలపట్టీ అంటూ ఏం ఉండదు మెకానిక్కు మూడ్‌ని బట్టి వుంటుంది. అర్థరూపాయితో అవ్వచ్చు, అరవై రూపాయలతో బైటపడొచ్చు చెప్పలేం.

సూరి : అయితే ఈ యాభై వుంచండి ( కాగితాన్ని అందించాడు )

అప్ప : ( అందుకుంటూ ఏవిటి – ఇది గూడా సేవలో ఒక భాగమా ) ఇలా డబ్బులిచ్చి సేవల్చేస్తే నువు ఈ జన్మలో బాగుపడి చావవు – ఇలా అన్నానని రాత్రికి మీ నాన్నగాని కల్లోకొస్తే చెప్పు – నాకేం భయం లేదు.

సూరి : అలాగే చెపుతానండి – మీ అడ్రస్సు గూడా ఇస్తా – మీరెళ్ళిరండి.

( అప్పలనర్సింహం వెళ్ళబోయి మళ్ళీ ఏదో గుర్తుకొచ్చినట్లు గిరుక్కున తిరిగి లోనికెళ్ళబోయాడు – సూరి కంగారుగా ఎదురెళ్ళి నిల్చున్నాడు )

సూరి : మళ్ళీ ఎక్కడకండి ?

అప్ప : అబ్బబ్బ – నీతో పెద్ద చిక్కొచ్చి పండిదోయ్ – అన్ని నీకే కావాలి – అదేవంటే మీ నాన్న కల్లోకొస్తాడంటావ్ – క్రితంసారి నే వచ్చినప్పుడు మా వెధవకి నా గడియారం ఇచ్చి బాగు చేయించమన్నా – అదిగాని ఆ బీరువాలో ఏడ్చిందేమో చూద్దామని.

సూరి : ఇప్పుడవన్నీ ఎందుకండి – వచ్చాక చూసుకోవచ్చు – వెళ్ళిరండి.

అప్పు : సలహాలివ్వకు – నాక్కోపం వస్తూంది వస్తే తొక్కి నారతీయాల్సి వుంటుంది. గడియారం లేందే గడప దాటను అది నా సెంటిమెంట్.

సూరి : సరే. అయితే ఇదుంచండి కాస్సేపు ( చేతికున్న వాచ్ తీసి ఇచ్చాడు )

అప్పు : ( అందుకుంటూ ) ఇలా అడిగిందల్లా ఇచ్చెయ్యటానికి కారణం కల్లో కొచ్చే మీ నాన్నేనా – వేరే ఏదైనా కధుందా !

సూరి : అబ్బే కధలు లేవు – నాటకాల్లేవు. వెళ్ళిరండి త్వరగా.

అప్పు : సరే నే వచ్చేసరికి నీళ్ళు దింపి, నాలుగు కుంకుడు కాయలు కొట్టి గిన్నెలో వేసుంచు – అవునూ – ఇంట్లో సున్నిపిండుందా ?

సూరి : వుందండి – వెన్నపూసకూడా వుందండి.

అప్పు : గుడ్ – అన్ని సిద్ధంగా వుంచు – వచ్చి తలంటుకుంటా ఇదిగో చూడు – ఇలా కట్టుకున్న పెళ్ళానికి చెప్పినట్లు చెప్పి చేయించుకుంటున్నానని ఏమీ అనుకోకు. ఏదో మీనాన్న ఆత్మ శాంతిస్తుందని, కల్లో కొచ్చి నిన్ను తొక్కి నారతీసే శ్రమతప్పుతుందేమోనని – అంతే సుమా.

సూరి : భలేవారు మీ మనసు నాకు తెలీదూ – నలుగుపెట్టినట్లు నసపెడతారే గాని మీ మనసు వెన్నపూసకదూ – వెళ్ళిరండి. ఆలస్యమైనా రిపేరు గట్టిగా చేయించుకురండి.

అప్పు : అలాగే – గట్టిగా రిపేరు చెయ్యకపోతే వెధవని తొక్కి నార తియ్యనూ ( అని చెప్పులు తొడుక్కుంటున్నాడు )

సూరి : ( కంగారుగా ) అవి – అవి నాజోళ్ళండి.

అప్పు : అబ్బ – తెల్సులేవోయ్ – నీ జోళ్ళు బాగున్నాయ్ – వచ్చేటప్పుడు ఇలాంటివే తెచ్చుకుందామని నమూనాకి తీసికెడుతున్నా.

సూరి : ( నుదురు కొట్టుకుంటూ ) అలాగే పట్టుకెళ్ళండి. మీ పని నా పని పూర్తయితే అంతేచాలు.

అప్పు : నీపనా ?

సూరి : అదే వేడి నీళ్ళు, కుంకుడుకాయలు, సున్నిపిండి, వెన్నపూస అవి.

అప్పు : సరిసరి వెళ్ళొస్తా – ఇల్లు జాగ్రత్త – పది నిముషాల్లో వచ్చేస్తా ( అనుకుంటూ అప్పల నర్శింహం వెళ్ళిపోయాడు ) ( సూరిబాబు వీధి తలుపు గడియపెట్టి గాలి పీల్చుకున్నాడు లోనికి వెళ్ళబోతూ )

సూరి : నిజంగా కాస్సేపు తొక్కి నారతీసాడు. వీడిల్లు బంగారంగాను – కృష్ణమూర్తి ఈ ముసలాడితో ఎలా వేగుతున్నాడోగాని – త్వరగా పని పూర్తి చేసుకుని బయటపడటం బెటరు. ( అనుకుంటూ లోనికి వెళ్ళబోయే సరికి వీధి తలుపు మళ్ళీ చప్పుడయ్యింది. విసుగ్గా మొహం పెట్టి – నడుంపైకి చేతులుంచుకుని ) ఏ ముహూర్తాన మోజుపడి ఈ అమ్మడ్ని ఆటో ఎక్కించానోగాని అడుగడుగునా అవాంతరాలు – అపశకునాలు – మళ్ళీ అప్పలనర్సింహం వెనక్కొచ్చేసుంటాడు. గడియి తియ్యకపోతే గడపలో కూర్చుంటాడు వీడమ్మ కడుపుకాలా ) అనుకుంటూ వెళ్ళి తలుపు తీసేడు కృష్ణమూర్తి, సుబ్బలక్ష్మి లోనికొచ్చారు )

సూరి : ( అశ్చర్యంగా ) ఏవిట్రా – అప్పుడే అయిపోయిందా సినిమా.

సుబ్బ : మూడుగంటల సినిమా గంటన్నరలో అయిపోయింది. చక్కగా కొత్త సినిమాకెడదామండీ అంటే ఆ దిక్కుమాలిన పాత సినిమాకి తీసికెళ్ళేరు.

సూరి : ఇంటర్వల్లో గాని లోచొచ్చేసారా ?

కృష్ణ : పాతప్రింటు – మాటమాటకి పొట్లాలదారం తెగినట్టు తెగిపోయిందా ఫిల్ము, అద్సరే – ఆయనెవర్రా సంచి చేత్తో పుచ్చుకుని మనింట్లోనించి బయటకు వెడుతున్నాడు ?

సూరి : వెధవ జోకులెయ్యకు – తండ్రిని పట్టుకుని ఎవరని అడుగుతావా, ఈ విషయం గనక ఆయనకి తెలిస్తే తొక్కి నార తీస్తారు.

సుబ్బ : తండ్రా – ఎవరి తండ్రి....

సూరి : ఏవిటి సిస్టర్ – వాడంటే వెధవ నోటికొచ్చినట్లు వాగుతాడు. కాని మీరుకూడా వాడితో కలిసి వంతపాట్టం ఏం బాగాలేదు. మీ మావగారు అప్పలనర్సింహంగారు మీరటువెళ్ళగానే వచ్చారు. మీ టు–ఇన్–వన్ రిపేర్ చేయించుకొస్తానని బజారుకెళ్ళారు.రాగానే తలంటుకుంటానంటే నీళ్ళుగూడా పడేశాను.

కృష్ణ : (గాభరాగా ) ఓరి నిన్ను తగలెయ్యా – వాడెవడో మనకి తలంటేట్రా.

సూరి : ఒరే – ఒరే – తండ్రిని పట్టుకొని వాడు వీడు అన్నావంటే......

కృష్ణ : కొంపముంచావుగదరా – మా నాన్నపోయి అయిదేళ్ళయిందిరా ...

సూరి : ఆ ...( అని అరచి కూలబడ్డాడు )

సుబ్బ : అవునండి – నే కాపురానికి రాగానే మా మావగారు గుండాగి చనిపోయారు.

సూరి : అయితే ఈ అప్పలనర్శింహం ఎవడు ? అంటే మీ టూ–ఇన్–వన్ నా వాచీ, జోళ్ళు, యాభై కాగితం అన్నీ కాళ్ళొచ్చి పోయాయన్న మాట. అన్నంత పని చేసాడు – తొక్కి నార తీసేడు.

సుబ్బ : ( గుండెలు బాదుకుంటూ ) ఓర్నాయనోయ్ – వాడెవడో ఇల్లు దోచుకుపోయాడండి – ఇంకేం పోయాయో చూసొస్తానండి – ( అంటూ లోనికి పరిగెత్తెబోయింది – సూరిబాబు సుడిగాలిలా వచ్చి అడ్డుపడ్డాడు )

సూరి : సిస్టర్ – లోపలికి వెళ్ళొద్దు. నా పరువుగూడా పోతుంది.

కృష్ణ : ఏవిట్రా – అదింకా లోపలే...

సుబ్బ : ఎవరండి – అది ?

కృష్ణ : ఏం చెప్పను – ఎలా చెప్పను. అలా చూస్తావేరా ఇంకా బిక్షలు, దీక్షలు, వ్రతాలు పూర్తికాలేదా ?

సూరి : వ్రతమెక్కడ్రా అసలు విఘ్నేశ్వరపూజగూడ కాందే.

సుబ్బ : ఏవింటండి – అసలేం జరిగింది – బిక్షలేవిటి, దీక్షలేవిటి, వ్రతాలేవిటి, అసలేవిటండీ ఇదంతా.

కృష్ణ : సినిమా సుబ్బులూ, బూతు సినిమా – అలా చూస్తావేరా చెప్పు, ఏం చెబుతావో, ఎలా చెబుతావో చెప్పుకో.

సుబ్బ : సూరిబాబుగారు ... చెప్పండి – ఎందుకలా కంగారుపడుతున్నారు ?
సినిమా ఏవిటి ! బూతేవిటి – వ్రతం ఏవిటి, విఘ్నేశ్వర పూజేవిటి చెప్పండి ....

సూరి : నన్నేం అడక్కు సిస్టర్ – అది మాత్రం అడక్కు.

సుబ్బ : ( కోపంగా ) పోనీ మీరన్నా చెబుతారా లేదా ?

కృష్ణ : ఎవర్నీ అడగక్కర్లేదు సుబ్బులూ – లోపలికెళ్ళి చూడు అంతా నీకే తెలుస్తుంది – వెళ్ళు ( సుబ్బలక్ష్మి ఇద్దరివంకా అనుమానంగా చూస్తూ లోనికెళ్ళింది )

కృష్ణ : చూసావురా రాస్కెల్ – నీ రెండుక్షణాల సుఖంకోసం ఎంతనర్థం జరిగిందో చూడు నిక్షేపం లాంటి వస్తువులు పోయాయి. ఇప్పుడా పిల్లని సుబ్బలక్ష్మి రెక్క పుచ్చుకు లాక్కొచ్చి ఎవరని అడిగితే ఏం చెప్పుకుంటావో చెప్పుకో – నాకేం సంబంధంలేదు.

సూరి : క్షమించరా – ఇలా జరుగుతుందని వూహించాను కాదు మీ నాన్న పోయాడన్న సంగతి నాకు తెలీకపోవటంచేత ఆ అప్పలనర్శింహం మాట నమ్మేను. తెల్సుంటే తొక్కి నారతీసేవాడ్ని. సిస్టర్‌కి నువ్వే ఏదో ఒకటి సర్ది చెప్పు – ఆ పిల్ల మా మేనత్తకూతురని పెళ్ళి చేసుకోబోతున్నామని చెప్పు – నీకు పుణ్యముంటుంది. ఇవి చేతులు కావు – నువ్వు కృష్ణమూర్తివి కావు సాక్షాత్తు దేవుడివి.

కృష్ణ : ఛస్తే నీ పరువు కాపాడను – సుబ్బులు ముందు కుండబద్దలు కొట్టేస్తానంతే ( అంటుండగా లోపల్నించి " ఏవండోయ్ కొంప మునిగిందండి " అని సుబ్బలక్ష్మి కేక వినిపించింది )

కృష్ణ : చూసావుగా – వెళ్ళు – వెళ్ళి నీ నోటితోనే మొత్తం చెప్పేసి కాళ్ళమీద పడు, బుద్దొస్తుంది.

సూరి : అదేదో నువ్వే చేసెయ్యరా నీ మేలు మర్చిపోను.

కృష్ణ : అంటే నీ కోసం, పెళ్ళాం కాళ్ళమీద నే పడాలనా నీ ఉద్దేశ్యం ?
( అంతలో సుబ్బలక్ష్మి స్టేజిపైకొచ్చింది )

సుబ్బ : కొంప మునిగిందండి – బీరువాలో నా పట్టుచీరెలు, పన్నీరు బుడ్డి, గంధం గిన్నె, వంటింటిలో స్టీలు సామానులు మొత్తం పోయాయండి – కొంప దోచేశారు – దేవుడోయ్ ! ( అంటూ కూలబడింది )

సూరి : అంటే లోపల ఎవ్వరూ లేరా ?

సుబ్బ : ( లేస్తూ )ఎవ్వరూలేరండి – దొడ్డి తలుపు తీసుంది. ఇప్పటికయినా జరిగిందేవిటో చెప్పండి.

కృష్ణ : నేను మాత్రం ఎలా చెప్పేది సుబ్బలక్ష్మి – అడక్కు – ఏం జరిగిందని అడక్కు – ఆ వక్కటి అడక్కు – అది మాత్రం అడక్కు.

సుబ్బ : అది కాదండీ....

సూరి : వద్దు సిస్టర్ – నా వల్ల మీకొచ్చిన నష్టాన్ని నేనే భరిస్తా – కాని అది మాత్రం అడక్కు దయచేసి అడక్కు.

సుబ్బ : ఏవిటో అంతా అయోమయంగా ఉందండి – సొమ్ముకి సొమ్ము పోయింది. ఏం జరిగిందంటే అది మాత్రం అడగొద్దంటున్నారు.

కృష్ణ : అలా అనక ఏం మొహం పెట్టుకుని చెప్పమంటావ్ ? పెళ్ళిళ్ళు చేసుకోకుండా బాధ్యతల్ని భుజాన వేసుకోటానికి భయపడి, అడ్డదారుల్లో సుఖాలని కొనుక్కోవాలనే సూరిబాబులాంటి దౌర్భాగ్యులకి వాళ్ళమీద జాలిపడి, కోవెలలాంటి నా కొంపని నీచమైన పన్లకు ఇచ్చినందుకు నాకు ఈ శిక్ష పడాల్సిందే.

సూరి : అవున్రా – ఆ అమ్మడు,అప్పలనర్శింహం నా కళ్లు తెరిపించేరు. కొన్ని కొన్ని సుఖాలు సరదాలు డబ్బిస్తే వచ్చేవికావని వాటికి వెలకట్టే సాహసం గూడా తప్పేనని తెలిసొచ్చింది.

( అంటూ సుబ్బలక్ష్మి దగ్గరకొచ్చి మోకాళ్ళపై కూర్చుని ) నన్ను క్షమించాల్సింది వాడుకాదు మీరు ( సుబ్బలక్ష్మి ఏదో చెప్పబోయింది ) ఎందుకు, ఏవిటని వివరాలడక్కండి – క్షమించానని ఒక్క మాటనండి సిస్టర్ చాలు – ప్లీజ్ ! అది మాత్రం అడక్కు – అది మాత్రం అడక్కు. ( సుబ్బలక్ష్మి అతడివంక చూస్తోంది. కృష్ణమూర్తి నడుంపై చేతులుంచుకుని సూరిబాబు వంక చూస్తుండగా )

**––––– తెర –––––**